## పాడి రైతులను ఆదుకోవాలి



20 ఏళ్లుగా పాడి రైతులను ప్రోత్సహిస్తూ పాల ఉత్పత్తిదారులకు, వినియోగదారులకు సేవలందిస్తున్న కరీంనగర్ డెయిరీ సంస్థ యజమాన్యంపై అనుమతుల పేర్లతో ఇబ్బందులకు గురి చేయడం సరికాదు. వేల మంది పాడి రైతుల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తున్న కరీంనగర్ డెయిరీ పాల సేకరణ నిలిచిపోవడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పెద్దలు పాల సేకరణ ప్రారంభించి పాడి రైతులను ఆదుకోవాలి.

**- అల్లూరి తిరుపతిరెడ్డి, పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు, మూడపల్లి, చందుర్తి**

## రైతులమంతా ఆగమైతున్నం



రోజూ తీసుకున్నట్టే పాలు తీసుకుంటురని వచ్చేసరికి సెప్పక, సెయ్యక పాలు కొనుడు బంజేసిన్రు. ఈడికచ్చి రైతలందమంరం ఆగమైతున్నం. ఇప్పుడు ఈ పాలు ఎవలకియ్యాలె ఏం జేసుకోవాలె. రేపుగూడా తేవద్దంటున్నరు. అగ్రారం పాలు దీసుకపోయి రేపుపొద్దుగాల ఆడనే కూసుంటం ఇగ.

**- పెద్దమ్మల రాజయ్య, పాడిరైతు, ఎల్లారెడ్డిపేట**

## పాలన్నీ ఏంజెయ్యాలె



ఊర్లె వంద, వంద యాభై మంది పాలు అమ్మే రైతులున్నరు. ఇయ్యాలంటె కొద్దోగొప్పో పాలున్నోళ్లు తోడేసుకుంటరు. డెయిరీ పెట్టినోళ్ల సంగతేంది. ఈ కలెక్టర్ ఏం ఆలోచిస్తున్నడో ఏందో అర్థమైత లేదు. నేను రోజూ పొద్దున, సాయంత్రం ఆరేసి లీటర్ల తీసుకస్త రేపుగూడ వద్దన్నరు. రైతులను అరిగోస పెడ్తున్నరు .

**- నర్సింలు, పాడి రైతు, ఎల్లారెడ్డిపేట**



కోనరావుపేట: మామిడిపల్లి గ్రామంలో పాలకేంద్రం ఎదుట పాల డబ్బాలతో నిరసన తెలుపుతున్న రైతులు




ముస్తాబాద్ : మండల కేంద్రంలోని పాల కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పాడి రైతులు

# రైతులపై కక్షసాధింపే..!

- అగ్రహారం పాలశీతలీకరణ కేంద్రం సీజ్ చేయడంపై పాడి రైతుల ఆగ్రహం
- పాలక్యాన్లతో రోడ్డుపై ధర్నా
- పాలు పాలబోసి నిరసన

వేములవాడ మండలం అగ్రహారం వద్ద ఉన్న కరీంనగర్ మిల్క్‌ప్రొడ్యూసర్ కంపెనీ పాలశీతలీకరణ కేంద్రాన్ని పర్మిషన్ లేదని సీజ్ చేయడంపై గురువారం పాడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని వేములవాడ రూరల్, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, కోనరావుపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, చందుర్తి మండలాల్లో నిరసన తెలిపారు. పాల క్యాన్లతో ధర్నా చేశారు. గంభీరావుపేట, వేములవాడ రూరల్ మండలం అనుపురంలో రోడ్డుపై పాలను పారబోశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**-వేములవాడ రూరల్ /ఎల్లారెడ్డిపేట,/గంభీరావుపేట/ఇల్లంతకుంట/ముస్తాబాద్/ కోనరావుపేట/ వీర్నపల్లి/ చందుర్తి, ఫిబ్రవరి 20**



గంభీరావుపేట: పాలను రోడ్డుపై పారబోస్తున్న పాడి రైతు



ఇల్లంతకుంట : సోమారంపేటలో ధర్నా చేస్తున్న పాడి రైతులు

## పాడి రైతుల ఉసురు తగుల్తది



అగ్రహారం డెయిరీ చిల్లింగ్ సెంటర్‌ను సీజ్ చేయడం సరి కాదు. వీర్నపల్లిలో రోజుకు 300 లీటర్ల పాలు సెంటర్‌కు పంపుతున్నాం. నెలకు రూ.6 లక్షల దాకా ఇస్తున్నాం. 19 సంవత్సరాలుగా పాల కేంద్రంలో పాలు పోస్తున్న. మా లాంటి రైతులను ఇబ్బంది చేస్తే ప్రభుత్వానికే నష్టం. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి పాడి రైతుల ఉసురు తగలుతది.

**-దర్శనాల లింబాద్రి**

## మీ సేవ కేంద్రం సీజ్



వేములవాడ పట్టణంలోని మీ సేవ సెంటర్‌ను సీజ్ చేసిన అధికారులు

వేములవాడ, ఫిబ్రవరి 20: వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వాణిజ్య సముదాయంలో సన్‌రేస్ అనే మీ సేవ కేంద్రాన్ని వేములవాడ తహసీల్దార్ మహేశ్ కుమార్ గురువారం సీజ్ చేశారు. నిర్వాహకుడు తంపుల సుమన్ మాట్లాడుతూ, తాను పది సంవత్సరాలుగా మీ సేవ కేంద్రాన్ని నడుపుతున్నానని తెలిపాడు. తనకు ఎలాంటి సమాచారం లేకుండానే అధికారులు సీజ్ చేశారని వాపోయాడు. ఈ విషయమై తహసీల్దార్ మహేశ్‌ను వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతుండడమే కాకుండా, తరచూ తప్పులు దొర్లుతున్నాయని అందిన ఫిర్యాదుల మేరకు సీజ్ చేశామని తెలిపారు.

## మీ పిల్లలకు ఉడకని అన్నం పెడతారా..?

- కేజీబీవీ సిబ్బందిపై తహసీల్దార్ ఆగ్రహం
- మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసున్న తహసీల్దార్ మారుతిరెడ్డి

వీర్నపల్లి, ఫిబ్రవరి 20: 'మీ పిల్లలకు ఉడకని అన్నంతో భోజనం పెడతారా..?' అంటూ పాఠశాల సిబ్బందిపై తహసీల్దార్ మారుతీరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. వండిన అన్నం, కూరగాయలు, నిల్వ ఉన్న సరుకులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం ఎందుకు అందించడం లేదని సిబ్బందిని ప్రశ్నించారు. విధులకు గైర్హాజరైనా కూడా కొందరు సిబ్బంది హాజరు పట్టికలో నమోదు చేయకుండా ఖాళీగా ఉంచడంపై మండిపడ్డారు. అనంతరం విదార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారం రోజులుగా ఉడకని అన్నమే పెడుతున్నారని తహసీల్దార్‌కు విద్యార్థినులు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని పేర్కొన్నారు.

### ప్రత్యేకాధికారి లేక పర్యవేక్షణ కరువు

నెల రోజులుగా మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ప్రత్యేకాధికారి లేకపోవడంతో పర్యవేక్షణ కరువైంది. నాన్ టీచింగ్, రెగ్యులర్ ఉపాధ్యాయునుల మధ్య సయోధ్య లేక విదార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడ ఎస్‌వోగా పనిచేసిన పద్మ మర్రిపల్లికి బదిలీపై వెళ్లారు. అనంతరం ఎస్‌వోగా బదిలీపై రావాల్సిన శకుంతల ఇంతవరకు విధుల్లో చేరలేదు. అప్పటి నుంచి ఇన్‌చార్జిలే ఎస్‌వోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## శివారు ఆలయాల్లో వరుస దొంగతనాలు



మొర్రాయిపల్లె చౌడాలమ్మ ఆలయంలో పరిశీలిస్తున్న సంఘం నాయకులు

ముస్తాబాద్, ఫిబ్రవరి 20 : మండలంలోని గ్రామ శివారులోని ఆలయాల్లో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ఆలయ కమిటీల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మొర్రాయిపల్లె గ్రామ శివారులోని చౌడాలమ్మ (యాదవ కుర్మ) ఆలయంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి తొమ్మిది కిలోల ఇత్తడి గంటతో పాటు సామగ్రిని దొంగిలించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇటీవల మండలంలోని కట్టమైసమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ ఆలయాల్లోనూ చోరీలు జరిగాయని ఆలయ నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొర్రాయిపల్లె చోరీపై చర్యలు తీసుకోవాలని సంఘ అధ్యక్షులు, సభ్యులు దమ్మ మల్లేశం, కుర్మరాజు, దోమ మల్లేశం, అనమేని పర్వతాలు, సిరివేన పర్వతాలు, కురుమ నర్సింలు, రాగం కిశోర్ కోరారు.

## మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



పార్కింగ్ స్థలాలపై ఆలయ అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 20 : ఈనెల 25 నుంచి 27 వరకు రాజన్న ఆలయంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా ఏర్పాట్లను ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు, చలువ పందిళ్లు, క్యూలను పరిశీలించారు. ఆయన వెంట ఆలయ ఈఈ రాజేశ్, డీఈ మైపాల్ రెడ్డి, ఏఈ రాంకిషన్‌రావు, ఏఈవో శ్రవణ్‌కుమార్, పట్టణ సీఐ వీరప్రసాద్, ట్రాఫిక్ ఎస్‌ఐ రాజు తదితరులున్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టీ స్కైలాబ్ బాబు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు

కలెక్టరేట్, ఫిబ్రవరి 20 : ఏటా కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్న బీజేపీని ఎమ్మెల్సీ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టీ స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. గురువారం సిరిసిల్లలోని బీవైనగర్ అమృత్‌లాల్ శుక్లా భవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు జవ్వాజీ విమల అధ్యక్షతన జరిగిన సీపీఎం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర బీజేపీ సర్కార్ 11 ఏళ్లలో కరీంనగర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గం పరిధిలో ఒక్క నిరుద్యోగికైనా కేంద్ర ప్రభుత్వం నుంచి ఉద్యోగం కల్పించిందా అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మత విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప నిరుద్యోగ సమస్యపై పార్లమెంటులో ఏనాడైనా ప్రస్తావించారా అని ప్రశ్నించారు. నేటి యువతరం తెలంగాణ రాష్ట్రాన్ని ప్రశాంత వాతావరణంలో చూడాలంటే బీజేపీని ఓడించాలని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోడం రమణ, జిల్లా కమిటీ సభ్యులు గన్నేరం నర్సయ్య, ఎర్రవెల్లి నాగరాజు, సూరం పద్మ, అన్నల్‌దాస్ గణేశ్, గురిజాల శ్రీధర్, మల్లారపు ప్రశాంత్, ఎలిగేటి రాజశేఖర్, శ్రీరాముల రమేశ్ చంద్ర, కార్యదర్శులు సిరిమల్లె సత్యం, నక్క దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★ Emjyala Akhil S/o Emjyala Ravinder (Old Name) H.No. 4-84/1, Lingampeta, Chandurthi mandal, Rajanna Sircilla Dist., my surname was changed to **EMJALA AKHIL S/o EMJALA RAVINDER** (New Name)
NTK-00000

★ Emjyala Ravinder S/o Lachaiah (Old Name) H.No. 4-84/1, Lingampeta, Chandurthi mandal, Rajanna Sircilla Dist., my surname was changed to **EMJALA RAVINDER S/o LACHAIAH** (New Name)
NTK-00000

★ Emjyala Lavanya W/o Ravinder (Old Name) H.No. 4-84/1, Lingampeta, Chandurthi mandal, Rajanna Sircilla Dist., my surname was changed to **EMJALA LAVANYA W/o EMJALA RAVINDER** (New Name)
NTK-00000

CHANGE OF NAME

**SURABHI BHARATHI, W/O. PURUSHOTHAM RAO** (Old name) R/o. H.No. 3-7/2, BANDANKAL VILLAGE, MANDAL MUSTABAD, DIST. RAJANNA SIRCILLA, T.S. INDIA-505404. Hereby declare that I have changed my name as **SURABHI BHARATHI DEVI W/O. SURABHI PURUSHOTHAM RAO (New Name)**

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189


## దవాఖానలో ఉచిత యోగా శిక్షణ



వేములవాడ ఏరియా దవాఖానలో యోగ శిక్షణ అందిస్తున్న శిక్షకులు

వేములవాడ, ఫిబ్రవరి 20: వేములవాడ ఏరియా దవాఖానలో ఆయుష్ ఆరోగ్య మందిర్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉచిత యోగా శిక్షణను అందిస్తున్నట్లు యోగా శిక్షకులు ఎలిగేటి కృష్ణ, రిషికలు గురువారం తెలిపారు. అనారోగ్య సమస్యలు, మానసిక సమస్యలు ఉన్నవారికి సహజంగా యోగా శిక్షణ ద్వారా సహజంగా తగ్గించుకునే విధంగా యోగాసనాలు శిక్షణ ద్వారా అందిస్తామని వారు తెలిపారు.

## బాధ్యతల స్వీకరణ



మజీద్ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సయ్యద్ సమీ(మౌలానా)

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 20: సిరిసిల్ల మజీద్ కమిటీ అధ్యక్షుడిగా సయ్యద్ సమీ (మౌలానా) గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో కమిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఇక్కడ సలీం, యూసుఫ్, రీనా బాబా, ఖాదర్, రఫీ, అక్రం, సోహెల్, ముంతాజ్, మునీర్, మహమూద్, ఫయాజ్, ముజీబ్, షాదాబ్, అంజద్, తదితరులున్నారు.

## ఉచిత వైద్య శిబిరం



సిరిసిల్లలోని ఎస్‌బీఐ కార్యాలయంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న మెడికవర్ హాస్పిటల్ వైద్యులు

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 20: మెడికవర్ హాస్పిటల్(కరీంనగర్) ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు వంద మందికి పైగా బీపీ, షుగర్, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు చేశారు. ఇక్కడ మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, డాక్టర్ శ్రీకాంత్, బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, బ్యాంకు ఉద్యోగులు, ఆసుపత్రి సిబ్బంది కోట కరుణాకర్, శ్రీకాంత్, లక్ష్మీరాజం, తదితరులున్నారు.

## నియామకం



మహమ్మద్ జహంగీర్

ముస్తాబాద్, ఫిబ్రవరి 20 : అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ముస్తాబాద్ బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు మహమ్మద్ జహంగీర్‌ని నియమించారు. మండల కేంద్రంలో అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు షేక్‌గౌస్ జహంగీర్ నియామక పత్రాన్ని పత్రికలకు అందించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ, ప్రజా హక్కులకు ఎక్కడ భంగం కలిగినా ప్రజల గొంతుకై పోరాటం చేస్తానని, పీడిత ప్రజల పక్షాన వారి హక్కుల సాధనే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. ఈ అవకాశం కల్పించిన అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం అధ్యక్షుడికి, కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు గాలిపెల్లి విద్యార్థులు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 20 : మండలంలోని గాలిపెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని పీడీ సాన బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలుర విభాగంలో 9వ తరగతి చదువుతున్న సుధగోని అఖిల్, బుర్ర హర్షవర్ధన్, చక్రాల వినయ్, బాలికల విభాగంలో కేశవేని అన్విత, ఎంద్ర సంజన ఎంపికయ్యారని తెలిపారు. వీరిని ప్రధానోపాధ్యాయురాలు పావని, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు, విద్యార్థులు అభినందించారు.

## మైక్ సెట్ అందజేత

ముస్తాబాద్, ఫిబ్రవరి 20 : మండలంలోని పోతుగల్ శ్రీశివకేశవ ఆలయానికి గ్రామ భక్తుడు చెక్కపల్లి జనార్దన్ తన తండ్రి రాములు జ్ఞాపకార్థం మైక్ సౌండ్ బాక్సులు, తివాచీ, ఎల్‌ఈడీ బల్బ్‌లు ఆలయ పూజారులకు అందించాడు. ఇక్కడ చెక్కపల్లి వెంకటమ్మ, వరి లక్ష్మణ్, వరి వెంకటేశ్, శ్రీనివాస్ మహేశ్, రాజు, కోల కృష్ణ, రాఘు పూజారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు స్థల పరిశీలన

చందుర్తి, ఫిబ్రవరి 20 : చందుర్తి మండలంలోని బండపల్లి గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాల నూతన భవనాల నిర్మాణ కోసం గురువారం స్థల పరిశీలన చేశారు. ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య భవన నిర్మాణ కోసం స్థలాలను పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. సాధ్యమైనంత తొందరగా అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీ శంకరమ్మ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు బుర్ర రేణుక తదితరులున్నారు.

## ఉపాధి హామీ మేట్‌పై విచారణ

వీర్నపల్లి, ఫిబ్రవరి 20 : మండలంలోని బావ్‌సింగ్ నాయక్ తండాలో ఇన్‌చార్జి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సీనియర్ మేట్ బానోతు లింబాద్రి ఉపాధి హామీ నిధులను దుర్వినియోగం చేశాడంటూ ఈనెల 7న గ్రామస్తులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఎంపీడీవో అబ్దుల్ వాజిద్, ఏపీవో శ్రీహరి గ్రామంలో బహిరంగ విచారణ చేపట్టారు. నిధుల దుర్వినియోగంపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. పూర్తి విచారణ తర్వాత చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

## హంసనీతి శతకం పుస్తకావిష్కరణ

బోయినపల్లి (వేములవాడ) ఫిబ్రవరి 20: హంసనీతి శతకం పుస్తకాన్ని గురువారం బోయినపల్లి మండల కేంద్రంలో మండల విద్యాధికారి శ్రవణ్ కుమార్ విలాసాగర్ హైస్కూల్ హెచ్‌ఎం బొలగం శ్రీనివాస్, బోయినపల్లి హైస్కూల్ హెచ్‌ఎం కొను భూమయ్యతో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొలనూరులో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న ఈ పుస్తకం రచించిన గుర్రం అంజయ్యను అభినందించారు. కార్యక్రమంలో బోయినిపల్లి, తంగళ్లపెల్లి, ఇల్లంతకుంట మండలాల తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రుద్రంగిలో ప్రభుత్వ భూమికి హద్దులు ఏర్పాటు

రుద్రంగి, ఫిబ్రవరి 20: రుద్రంగి గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని గ్రామానికి చెందిన యువకుడు పిట్టల నరేశ్ హైకోర్టులో పిల్ దాఖలు చేయగా గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమికి రెవెన్యూ అధికారులు గురువారం హద్దులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీవో సుధాకర్ మాట్లాడుతూ, గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 428/2, 428/3, 428/4 మూడు సర్వే నంబర్లలోని ఎకరం ముప్పై రెండు (1-32) గుంటలు గల ప్రభుత్వ భూమిలో కొంత భూమి కబ్జాకు గురైందని పిట్టల నరేశ్ ఆరోపించడంతో డిజిటల్ సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కబ్జాకు గురైన వాటిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక్కడ ఆర్‌ఐ శ్యామ్, కార్యదర్శి రాందాస్, నాయకులు దయ్యాల కమలాకర్, కంటె రెడ్డి, చెప్యాల గణేశ్, ఉప్పులూటి గణేశ్, అంబటి రాములు, నరేశ్, గంగరెడ్డి, పెద్దులు, బాబా, అనిల్, ఉదయ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణంలో మార్పులపై జాగ్రత్తలు తీసుకోవాలి



లింగంపేట పౌల్ట్రీని పరిశీలిస్తున్న మండల ఇన్‌చార్జి పశు వైద్యాధికారి శ్రీధర్

చందుర్తి, ఫిబ్రవరి 20: వాతావరణంలో వచ్చే మార్పులకు అనుగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఇన్‌చార్జి పశు వైద్యాధికారి శ్రీధర్ సూచించారు. గురువారం లింగంపేట గ్రామంలో మృత్యువాత పడ్డ కోళ్లఫాంను సందర్శించారు. కోళ్ల మృత్యువాతపై శాంపిల్లు సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపేందుకు కోళ్ల కళేబరాలు లభించలేదన్నారు. లింగంపేట మల్యాల, చందుర్తి గ్రామాల్లోని పౌల్ట్రీ రైతులు కోళ్ల ఫాంల చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. కోళ్లకు ప్రణాళిక ప్రకారం టీకాలు వేయించాలన్నారు. కోళ్ల మృత్యువాత పడ్డ రైతు పౌల్ట్రీ ఫార్మ్ లను కొన్ని రోజులు ఖాళీగా ఉంచి, జాలీలకు మందు పిచికారీ చేసిన అనంతరం కోడి పిల్లలను పెంచాలని సూచించినట్లు తెలిపారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ముస్తాబాద్, ఫిబ్రవరి 20 : మండలంలోని పోతుగల్, బందనకల్ గ్రామాల్లో ఎల్‌వీ ప్రసాద్ కంటి దవాఖాన సిరిసిల్ల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రెండు గ్రామాల్లోని గ్రామ పంచాయతీల వద్ద 21న ఉదయం 9 నుంచి 1 గంట వరకు ఎల్‌వీ ప్రసాద్ కంటి దవాఖాన సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించడంలోపాటు కంటి పరీక్షల్లో ఆపరేషన్ అవసరం ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి వచ్చే ముందు ఆధార్ కార్డు తీసుకొని రావాలని కోరారు.